సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శనివారం । 28 । జనవరి । 2023



నేడు వెలుగుల రేడు పుట్టినరోజు


రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన పెదపూడి మండలం జి.మామిడాడ గ్రామంలో శ్రీ సూర్యనారాయణ మూర్తి స్వామివారి జయంతి, రథసప్తమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. -8లో▸



వెండి పూజా సామగ్రి సమర్పణ

అన్నవరం: శ్రీ సత్యనారాయణ స్వామివారికి పెమ్మరాజు వేంకటేశ్వరరావు దంపతులు (అహ్మదాబాద్) 969 గ్రాముల వెండి పూజా సామగ్రి శుక్రవారం సమర్పించారు.

డెల్టాలకు నీరు విడుదల




ధవళేశ్వరం: బ్యారేజి నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 8,000 క్యూసెక్కులు విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2300, మధ్య డెల్టాకు 1700, పశ్చిమ డెల్టాకు 4000 క్యూసెక్కుల నీటిని వదిలారు.

గోదారి గట్టు విలపిస్తోంది..

- అలనాటి అందాల తార జమున అస్తమయంతో జిల్లాలో విషాదం
- గోదావరితో ఈమెకు విడదీయలేని బంధం
- మూగమనసులతో మనసు దోచుకున్న నటి
- రాజమండ్రి ఎంపీగా రాజకీయ ప్రస్థానం





సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం)/అమలాపురం రంటౌన్/సామర్లకోట/కొవ్వూరు: గోదారీ గట్టుంది.. గట్టుమీన సెట్టుంది.. సెట్టుకొమ్మన పిట్టుంది.. పిట్ట మనసులో ఏముంది..ఈ పాట వినగానే ఠక్కున గుర్తుకు వచ్చేది గలగల పారే గోదావరి మాత్రమే కాదు..అమాయకత్వాన్ని..అందాన్ని.. అభినయాన్ని మూటగట్టుకున్న అలనాటి సినీనటి జమున..గోదావరిని..ఆ నదీమతల్లి పేరును తెరకు బలంగా పరిచయం చేసిన ఆమె మూగ మగమనసులు ఎప్పటికీ చిరస్మరణీయం ..రాజమహేంద్రవరానికి చెందిన దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు తాను అమితంగా ప్రేమించే గోదావరిని 1964లో ఈ చిత్రం ద్వారా తెరకెక్కించారు. గోదారి గట్టుంది పాటకు తన అభినయంతో జమున ప్రాణం పోశారు. శుక్రవారం ఉదయం జమున కన్నుమూశారని తెలియగానే జిల్లా ప్రజానీకం కంటతడి పెట్టింది. ఈ అందాల తారతో తమ గోదారి ప్రాంతానికి ఉన్న అనుబంధాన్ని నెమరు వేసుకుంది. చాలామంది ఈమెను గోదావరి జిల్లా వాసిగా భావిస్తారు. కర్నాటక హంపీలో పుట్టినా ఈమె మన జిల్లాతో మమతానురాగాలను పెనవేసుకున్నారు. అందుకే ఇక్కడి ప్రజలు కూడా ఆమెను తమ ఆడపడుచుగా ఆదరించారు.

గలగల పారుతున్న గోదారిలా..

1953లో జమున పుట్టిల్లు సినిమాతో తెరంగేట్రం చేసినా అంత గుర్తింపు రాలేదు. 1964లో ఆదుర్తి దర్శకత్వంలో నిర్మించిన మూగమనసులు చిత్రంలో ఈమె గౌరమ్మ పాత్ర పోషించారు. ఈ చిత్రం ద్వారా జమున ప్రేక్షకుల గుండెల్లో స్థిరమైన స్థానం సంపాదించుకున్నారు. అదే సినీమా హిందీలో మిలన్‌గా రీమేక్ చేస్తే అందులో కూడా నటించి మెప్పించారు. ఉత్తమ సహాయనటిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డు అందుకున్నారు. సఖినేటిపల్లి-నర్సాపురం మధ్య వశిష్ట గోదావరి గట్ల పైన..పడవలపైన ఈమెతో తీసిన 'గోదారి గట్టుంది.. పాట ఎప్పటికీ గుర్తుండిపోతుంది. 'నా పాట నీ నోట పలకాలా చిలకా' పాట కూడా గోదావరి అందాల బ్యాక్ డ్రాప్‌లోనే చిత్రీకరించారు. గోదావరికీ జమునకు విడదీయరాని బంధముందేమో. 1974లో చిత్రీకరించిన గౌరి సినిమాలో 'గల గల పారుతున్న గోదారిలా' పాటలో కృష్ణతో ఇక్కడి గోదావరి పాయల్లోనే నర్తించారు. 2014లో జరిగిన గోదావరి పుష్కరాలకు ఆమె పనిగట్టుకుని మరీ వచ్చారు.'గోదారి గట్టుంది' పాట తాను జీవించి ఉన్నంత కాలం గుర్తుంటుందని చెప్పడం విశేషం

పెద్ద మనసున్న నటి

1977లో సంభవించిన దివిసీమ ఉప్పెనతో కనీవినీ ఎరుగని నష్టం వాటిల్లింది. ఆ క్లిష్ట సమయంలో బాధితులకు అండగా ఎన్టీఆర్, ఏఎన్ఆర్ వంటి అగ్రతారలతో కలిసి జమున జోలె పట్టి చందాలు వసూలు చేశారు. ఇక్కడి ప్రజలు తమ ఆడపడుచు వచ్చినట్లుగా భావించి స్పందించారు. వంద రూపాయలిస్తే షేక్‌హ్యాండ్ ఇస్తానని సరదాగా అనడంతో అభిమానులు ఎగబడి ఆమెకు కరచాలనం చేసి విరివిగా విరాళాలు అందజేశారు.

రాజమండ్రి ఎంపీగా..

- ఇందిరాగాంధీ మీద ఉన్న అభిమానంతో జమున రాజకీయాలలో అడుగుపెట్టారు. తనను సినీరంగంలో ఆదరించిన రాజమండ్రి నుంచి 1989లో పోటీ చేశారు. లోక్‌సభ సభ్యురాలిగా 1991 వరకూ కొనసాగారు. తెలుగు ఆర్టిస్టుల అసోసియేషన్‌ను ప్రారంభించారు. రంగ స్థల వృత్తి కళాకారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలిగా ఉన్న తరుణంలో సామర్లకోట మండలం మాధవపట్నం శివారున ఉన్న తోలుబొమ్మ కళాకారుల జీవన పరిస్థితులు చూసి చలించిపోయారు. అప్పటి కలెక్టర్‌తో వారి ఇళ్ల స్థలాల గురించి మాట్లాడారు. గ్రామ సమీపంలో సుమారు 10 ఎకరాలను ప్రభుత్వంతో కొనుగోలు చేయించి మూడేసి సెంట్లు వంతున 176 మంది కళాకారులకు ఇళ్ల స్థలాలుగా అందజేశారు. ఎంపీగా ఉన్నప్పుడు తమ వద్దకు వచ్చి యోగ క్షేమాలు అడిగేవారని ఈ కళాకారుల సంఘ నాయకులు తోట బాలకృష్ణ, తోట గణపతి, రాష్ట్ర బొందిలిల కార్పోరేషన్ డైరెక్టర్ తోట సత్తిబాబులు గుర్తు చేసుకున్నారు. అందుకే మాధవపట్నం శివారు ప్రాంతాన్ని జమునానగర్‌గా వ్యవహరిస్తున్నారు.
- ఎంపీ హోదాలో జమున రాజమహేంద్రవరంలో 1991 ఏప్రిల్ 5న ఇందిరాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కొవ్వూరు మండలం నందమూరులో అంబేడ్కర్ విగ్రహాన్ని కూడా ఆవిష్కరించిన వైనాన్ని గ్రామస్తులు గుర్తు చేసుకున్నారు.
- 1989లో కొవ్వూరు అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేసిన రఫీయుల్లా బేగ్ తరఫున జమున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కాపవరంలో రఫీ మోటారు బైకు ఎక్కి ఆమె ప్రధాన వీధుల్లో తిరిగి ఓట్లు అభ్యర్థించారు.

రాజమహేంద్రి ఆడపడుచు జమున: ఎంపీ భరత్



రాజమహేంద్రవరం రూరల్: జమున మృతికి వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్‌రామ్ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆమె నటన తెలుగు ప్రజల గుండెల్లో ఎప్పటికీ సజీవమేనన్నారు. అగ్ర కథానాయకుల చెంత దీటుగా నటించి ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. సత్యభామ పాత్రలో ఆమె జీవించారన్నారు. 70 ఏళ్ల సినీ ప్రస్థానంలో ఎన్నో విజయాలు అందుకున్నారన్నారు. రాజమండ్రి నుంచి ఎంపీగా విజయం సాధించి ఈ ప్రాంత ఆడపడుచుగా పేరొందారని నివాళులర్పించారు.

జెట్ మిత్ర రండి...



జమున రాజమహేంద్రవరం నగరానికి ఎప్పుడు వచ్చినా జెట్ మిత్ర రండి అని నన్ను పిలిచేవారు. మేడమే నా పేరు జిత్ మోహన్ మిత్ర అని చెబితే మీరు పిలవగానే జెట్ స్పీడ్‌తో వస్తారు కదా ..అందుకే జెట్ మిత్ర అని పిలుస్తున్నాను అనేవారు. అమె ఎంపీగా పోటీ చేసినప్పుడు అమె దగ్గర ఉండి తోడ్పాటు అందించాను. పెద్ద తార అయినప్పటికీ భేషజం చూపించేవారు కాదు.

– శ్రీపాద జిత్‌మోహన్‌మిత్ర, సినీయర్ నటుడు

ఆమె ఆత్మకు శాంతి కలగాలి...



2016 శ్రీమహాలక్ష్మీ సమేత చిన వేంకటేశ్వర స్వామి పీఠం బ్రహ్మోత్సవాలలో సర్వేజనా సుఖినోభవంతు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జమునకు కళా తపస్విని అనే బిరుదును ప్రదానం చేశాం. రాజమహేంద్రవరం ఆడపడుచుగా ఆమెను సత్కరించుకున్నాం. ఆమె ఆత్మకు భగవంతుడు శాంతిని ప్రసాదించాలని కోరుకుంటున్నాను.

– డాక్టర్ శ్రీమాన్ చిన్న వెంకన్నబాబు స్వామిజీ



గోదారి గట్టుంది... పాటకు సఖినేటిపల్లి-నర్సాపురం వశిష్ట గోదావరి గట్లపై అభినయం చేస్తున్న జమున (ఫైల్ ఫొటో)



రఫీ మోటారు సైకిలు ఎక్కి ప్రచారం చేస్తున్న జమున



మాధవపట్నంలో తోలుబొమ్మలాట వృత్తి కళాకారుల సమావేశంలో పాల్గొన్న సినీనటి జమున

న్యూస్‌రీల్

తానా వేదికపై శినారా



ముమ్మిడివరం: అజాదికా అమృత మహోత్సవాలలో భాగంగా ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) ఈ నెల 29న ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'తెలుగు సాహిత్య సౌరభం' అంతర్జాతీయ వర్చువల్ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొనాలని ముమ్మిడివరం కళాసాహితీ వ్యవస్థాపకులు, సాహితీవేత్త పచ్చిమాల శివనాగరాజు(శినారా)కు ఆహ్వా నం అందింది. ఈ సమావేశంలో సాహిత్య ప్రక్రియపై ప్రసంగించేందుకు ఆయనకు అవకాశం లభించింది.

నిబంధనలే తారకరత్న ప్రాణాలను కాపాడాయి

అల్లవరం: నారా లోకేష్ పాదయాత్రలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలు పెట్టవలసి వచ్చిందని ఏపీ అగ్రిమిషన్ సభ్యులు జున్నూరి రామారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాదయాత్ర తొలి రోజునే స్వర్గీయ ఎన్టీఆర్ మనవడు తారకరత్న గుండెపోటుకు గురికావడం దురదృష్టకరమని రామారావు తెలిపారు. పాదయాత్రకు ప్రభుత్వం అడ్డు పడుతుందని ప్రతిపక్షాలు నానా రాద్ధాంతం చేస్తున్నాయని అన్నారు. తారకరత్న గుండెపోటుకు గురైన సమయంలో ప్రభుత్వం విధించిన నిబంధనల వల్లే ఘటనా స్థలంలో అంబులెన్స్ అందుబాటులో ఉండడం , సరైన సమయంలో ఆస్పత్రికి తరలించడంతో ఆయన ప్రాణాలకు ముప్పు తప్పిందన్నారు.

డ్రైవింగ్ నిబంధనల అమలుపై అలక్ష్యం వద్దు

అమలాపురం రూరల్: డ్రైవింగ్ నిబంధనల అమలుపై ఆర్టీసీ డ్రైవర్లు అలక్ష్యం లేకుండా అప్రమత్తతతో ఉండాలని జిల్లా ప్రజారవాణా శాఖాధికారి ఆర్‌వీఎస్ నాగేశ్వరరావు సూచించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా స్థానిక ఆర్టీసీ గ్యారేజీలో డ్రైవర్లకు శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సిబ్బంది రోడ్డు భద్రత, ప్రయాణికుల భద్రత రెండు కళ్లుగా భావించి విధులు నిర్వర్తించాలన్నారు. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఈవీవీఎస్ ఆదినారాయణ డ్రైవర్లకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. పట్టణ ఎస్సై హరీష్‌కుమార్ రోడ్డు ప్రమాదాల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డిపో, బస్ స్టేషన్ ప్రాంగణాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డిపో మేనేజర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో డీపీటీవో కార్యాలయ వ్యక్తిగత అధికారి ఎస్‌వై ప్రసాద్, మెకానికల్ ఇన్‌చార్జి దేవి, ట్రాఫిక్ ఇన్‌చార్జి ప్రతిమ, సెక్యూరిటీ ఎస్ఐ రామారావు పాల్గొన్నారు.

కనుల పండువకు వేళాయె..

- నేటి నుంచి లక్ష్మీనృసింహుని కల్యాణోత్సవాలు
- రథసప్తమి వేడుకలతో ప్రారంభం



లక్ష్మీనృసింహస్వామి



ప్రధాన గోపురంపై కొలువైఉన్న సూర్య భగవానుడు

సఖినేటిపల్లి: అంతర్వేదిలో సాగర తీరాన అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుని కల్యాణ మహోత్సవాలకు పుణ్యక్షేత్రం సిద్ధమైంది. ఈ క్షేత్రంలో వశిష్ట మహర్షి ప్రతిష్ఠించిన లక్ష్మీనృసింహుని కల్యాణ మహోత్సవాలు శనివారం రథసప్తమి రోజున ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 6 తేదీ వరకూ ఉత్సవాలను కన్నుల పండువగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

నేడు రథసప్తమి..

సర్వజగత్తుకు వెలుగును ప్రసాదించిన రోజు ఇది. ఉత్తరాయణ పుణ్యకాలంలో సూర్యగమనం దక్షిణ దిశ నుంచి ఉత్తర దిశకు మారడం రథసప్తమి నుంచే ఆరంభం కావడం ఈ రోజుకున్న ప్రాధాన్యతలతో ఒకటి. రథసప్తమి రోజున ఆదిత్యుని సేవిస్తే రోగ, శోక, పాప ఫలాలు నశిస్తాయన్నది భక్తుల నమ్మిక. రథసప్తమి రోజున రథానికి అర్చకులు చేసే పూజలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ప్రాంగణంలో ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ నిలువెత్తు విగ్రహానికి దేవస్థానం అధికారులు, ప్రజాప్రతినిధులు, అర్చకులు, అగ్నికుల క్షత్రియులు పూలమాలలు వేసి నివాళులర్పించడం ఆనవాయితీగా వస్తోంది.

సూర్య, చంద్ర ప్రభ వాహనాలపై ఊరేగింపు..

సూర్యభగవానుడి పుట్టినరోజు రథసప్తమి నాడు ప్రారంభమయ్యే వేడుకల్లో తొలి రోజు సూర్యవాహనం, చంద్రప్రభ వాహనంపై స్వామివారు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. స్వామివారికి ఉన్న వాహనాల్లో మొదటి రోజున పై రెండు వాహనాల్లో గ్రామోత్సవాలు అర్చకులు నిర్వహిస్తారు.

అపూర్వ ఘట్టం ముద్రికాలంకరణ..

రథసప్తమి రోజున ఆదిదేవుడిని పెళ్లి కొడుకుగా చేయడం. అమ్మవారిని పెళ్లి కుమార్తె చేయడం అపూర్వ ఘట్టం. తరతరాలుగా వస్తున్న ఆచారం ప్రకారం కేశవదాసుపాలేనికి చెందిన బెల్లంకొండ, ఉండపల్లి వారి కుటుంబ సభ్యులు సంయుక్తంగా స్వామి, అమ్మవార్లకు ముద్రికాలంకరణ నిర్వహిస్తారు. బుగ్గన చుక్కపెట్టి స్వామివారిని పెండ్లికుమారునిగా, అమ్మవార్లను పెండ్లికుమార్తెగా చేయడం ముద్రికాలంకరణ. అనంతరం స్వామి, అమ్మవార్లు అర్చకుల విశేష పూజలు అందుకుంటారు. స్వామి, అమ్మవార్లకు నూతన వస్త్రాలు సమర్పిస్తారు.

ఉత్సవాల షెడ్యూల్

28వ తేదీ రథథసప్తమి. ముద్రికాలంకరణ. 29న గురుడ, పుష్పక వాహనాలపై గ్రామోత్సవాలు. 30వ తేదీ హంసవాహనం, శేషవాహనంపై గ్రామోత్సవం, ధూపసేవ, ధ్వజారోహణ. 31వ తేదీ దశమి పంచముఖ ఆంజనేయస్వామి వాహనం, కంచుగరుడ వాహనంపై గ్రామోత్సవం. రాత్రి 12-46 గంటలకు రోహిణి నక్షత్రయుక్త తులా లగ్నంలో శ్రీస్వామివారి కల్యాణం. ఫిబ్రవరి ఒకటవ తేదీ భీష్మ ఏకాదశి నాడు రథోత్సవం. ఫిబ్రవరి 2న గజ, పొన్నవాహనాలపై గ్రామోత్సవం. రాత్రి అన్న పర్వత మహానివేదన. ఫిబ్రవరి 3న హనుమద్వాహనం, సింహవాహనంపై గ్రామోత్సవం. సాయంత్రం సదస్యం. ఫిబ్రవరి 4న రాజాధిరాజ వాహనం, అశ్వవాహనంపై గ్రామోత్సవం. రాత్రి 16 స్తంభాల మంటపం వద్ద చోర సంవాదం. ఫిబ్రవరి 5న గరుడ పుష్పక వాహనంపై స్వామి గ్రామోత్సవం, చక్రవారి అవభృధోత్సవం, సముద్రస్నానం, ధ్వజఅవరోహణ. ఫిబ్రవరి 6వ తేదీ సాయంత్రం 5గంటలకు పుష్పక వాహనంపై గ్రామోత్సవం, 6గంటలకు చెరువులో హంస వాహనంపై తెప్పోత్సవం. రాత్రి 8 గంటలకు ఉత్సవ మూర్తులకు తిరుమంజనములు, దర్పణసేవ, ధూపసేవ, ద్వాదశ తిరువారాధన, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, శ్రీపుష్పోత్సవం, చెంగోలం విన్నపం, తీర్థగోష్ఠి, స్వామివారి పవళింపు సేవతో ఉత్సవాల ముగింపు.

కొబ్బరి ఆధారిత పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహకాలు

కలెక్టర్ హిమాన్షుశుక్లా



సాక్షి అమలాపురం: జిల్లాలో కొబ్బరి ఆధారిత పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహకాలు అందించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులకు సూచించారు. శుక్రవారం ఉదయం జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం అమలాపురం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జిల్లాలో పారిశ్రామిక యూనిట్లకు సింగిల్ డెస్క్ విధానం ద్వారా ఇచ్చే ఆమోదాలు, పారిశ్రామిక అభివృద్ధి విధానం, జగనన్న బడుగు వికాసం విధానం ద్వారా పారిశ్రామిక యూనిట్లకు వివిధ రకాల ప్రోత్సాహకాల మంజూరు తదితర అంశాలపై కలెక్టర్ హిమాన్షు శుక్లా లైన్ డిపార్ట్‌మెంట్‌ల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో కొబ్బరి పండించే ప్రాంతాలలో కోనసీమ ఒకటని కానీ ఇక్కడ మిగతా ప్రాంతాల మాదిరిగా కొబ్బరి ఉప ఉత్పత్తుల పరిశ్రమలు లేవని, ఇక్కడ కొబ్బరి ఆధారిత ఉత్పత్తుల పరిశ్రమలను ప్రోత్సహించాలని అన్నారు. కేరళ రాష్ట్రంలోని కొచ్చిన్‌లో గల కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు అధికారులను జిల్లాకు ఆహ్వానించి కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లాలో వివిధ కొబ్బరి ఆధారిత పరిశ్రమలు స్థాపించేలా చూడాలని సూచించారు. ఈ ఫిబ్రవరి చివరి నాటికి జిల్లా స్థాయి పారిశ్రామిక ప్రోత్సాహక మీట్ నిర్వహించి కనీసం 20 మంది పెట్టుబడిదారులను గుర్తించి స్కూల్స్, మాల్స్ వంటివి నిర్మించేలా ప్రోత్సహించాలని కోరారు. జిల్లాలో వివిధ పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేసేటప్పుడు పర్యావరణానికి నష్టం కలిగించని వాటికి ప్రోత్సాహకాలు ఇవ్వాలని చెప్పారు. పరిశీలన ధ్రువీకరణ కమిటీ సూచించిన మైక్రో చిన్న మధ్య తరహా పరిశ్రమలకు పెట్టుబడి రాయితీ, వడ్డీ రాయితీ, విద్యుత్ టారిఫ్ రీయంబర్స్‌మెంట్, స్టాంప్ డ్యూటీ రీయింబర్స్‌మెంట్, అమ్మకపు పన్ను రీయింబర్స్‌మెంట్ కింద 33 క్లైమ్‌లకు సుమారు రూ.3.2 కోట్లు జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల కమిటీ ఆమోదం తెలిపింది. డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ఆఫీసర్ టి.మురళి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఏవీ మురళీకృష్ణ, ఫిషరీస్ జేడీ షేక్ జానీలాల్ మొహమ్మద్, డిస్టిక్ హార్టికల్చర్ ఆఫీసర్ మల్లికార్జునరావు, డీటీవో ప్రతాప్‌రావు, జిల్లా పంచాయతీ ఆఫీసర్ కృష్ణకుమారి, ఏపీ పీసీబీ అసిస్టెంట్ ఇంజినీర్ జి.కరుణరేఖ, లీడ్ బ్యాంక్ మేనేజర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

తాగునీటి కోసం రూ.5 కోట్లు

సీఎస్ఆర్ నిధులపై మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ సమీక్ష



సమీక్షిస్తున్న మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ, ఆర్డీవో వసంతరాయుడు

అమలాపురం టౌన్: అమలాపురం డివిజన్‌లో రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి ఎద్దడి ఎక్కడా తలెత్తకుండా రూ.5 కోట్ల సీఎస్ఆర్ నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ వెల్లడించారు. స్థానిక ఆర్డీవో కార్యాలంలో ఆర్డీవో వసంతరాయుడు అధ్యక్షతన పలు చమురు సంస్థల ప్రతినిధులు, పంచాయతీరాజ్, మండల పరిషత్, ప్రణాళిక విభాగం అధికారులతో శుక్రవారం సీఎస్ఆర్ నిధులపై జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి, ఎంపీ మాట్లాడారు. గడచిన ప్రస్తుత సంవత్సరాలకు సంబంధించిన నిధులపై ఈ సమీక్ష సాగింది. ఇప్పటికే 2022-23 సంవత్సరానికి వేదాంత ఆయిల్ అండ్ గ్యాస్ ప్లాంట్ ఉన్న ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం, ఇతర గ్రామాల్లో రోడ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను రూ.2.16 కోట్ల సీఎస్ఆర్ నిధులతో చేపట్టినట్లు మంత్రి విశ్వరూప్ వివరించారు. 2023-24 సంవత్సరానికి పూర్తిగా సీఎస్ఆర్ నిధులు రూ.5 కోట్లను తాగునీటి అవసరాల కోసం వెచ్చించేలా సమావేశం ఆమోదం తెలిపిందని ఎంపీ అనురాధ పేర్కొన్నారు. వేదాంత, ఇతర చమురు సంస్థల అధికారులు వి.సతీష్, పంచాయతీరాజ్, ప్రణాళికా విభాగం అధికారులతోపాటు ఉప్పలగుప్తం తహసీల్దార్ జవ్వాది వెంకటేశ్వరి, ఎంపీడీవో కేఎస్ గౌరీ కుమారి పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి ఓఎన్‌జీసీ రూ. 1.40 కోట్లు : ఎంపీ అనురాధ

అమలాపురం: ఓడలరేవు గ్రామం నుంచి ఓఎన్‌జీసీ ప్లాంట్ వరకు రహదారి నిర్మాణానికి నిధులు ఇచ్చేందుకు ఓఎన్‌జీసీ సంస్థ అంగీకరించింది. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం రాత్రి రాష్ట్ర రవాణా శాఖామంత్రి పినిపే విశ్వరూప్, అమలాపురం ఎంపీ చింతా అనురాధ, జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా ఓఎన్‌జీసీ ప్రతినిధులతో చర్చించారు. ఓడలరేవు ఓఎన్‌జీసీ ప్లాంట్ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.80లక్షలు, కల్వర్టు నిర్మాణానికి రూ.30లక్షలు, దేవరపల్లి గ్రామంలో రహదారి నిర్మాణానికి మరో 30లక్షలు ఇచ్చేందుకు అంగీకరించారు. రహదారి ప్రాధాన్యతను ఓఎన్‌జీసీ అధికారుల దృష్టికి తీసుకు వెళ్ళగా వారు మొత్తంగా కోటి 40లక్షల రూపాయలు ఇచ్చేందుకు అంగీకరించారని ఎంపీ చింతా అనురాధ 'సాక్షి'కి తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

తుని: అన్నవరం–తుని మధ్యలో రత్నాచల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందాడని తుని జీఆర్పీ ఎస్సై షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. శుక్రవారం అందిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించామన్నారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నాగరాజుపేట కాలనీకి చెందిన పి.అనిల్‌కుమార్ (33) కుటుంబ సభ్యులతో కలిసి గుడివాడలో జరిగిన నిశ్చితార్థ ఫంక్షన్‌కు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో నూజివీడు రైల్వేస్టేషన్‌లో రత్నాచల్ ఎక్కి వస్తుండగా అన్నవరం–తుని మధ్యలో రైలు నుంచి జారిపడి మృతి చెందాడన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ మారూఫ్ తెలిపారు.

నేడు వెలుగుల రేడు పుట్టినరోజు

సూర్యజయంతికి జి.మామిడాడలో ఏర్పాట్లు పూర్తి

పెదపూడి: రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన పెదపూడి మండలం జి.మామిడాడ గ్రామంలో శ్రీ సూర్యనారాయణమూర్తి స్వామివారి జయంతి, రథసప్తమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి వారి మంగళాశాసనాలతో ఆలయంలో శనివారం రథ సప్తమితో ప్రారంభమయ్యే కల్యాణ ఉత్సవాలు ఫిబ్రవరి ఆరో తేదీ వరకు జరుగుతాయి. ఫిబ్రవరి ఒకటో తేదీన స్వామివారి కల్యాణం జరుగుతుంది. శనివారం సూర్య భగవానుడి పుట్టిన రోజైన రథసప్తమి పర్వదినం సందర్భంగా ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి వెంకటనరసింహ ఆచార్యులు ఆధ్వర్యంలో 10 మంది పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. దూర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుంటారు. స్వామివారి దర్శనం నిమిత్తం భక్తులకు ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేశారు. సూర్యభగవానుని దేవేరులైన ఉష, పద్మిని, ఛాయ, సొంజ్ఞ ఉత్సవ మూర్తులతో కలిసి సూర్య భగవానుడుని పల్లకీలో ఉంచి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయిస్తారు. ఆలయం బయట ఉంచిన రథంలో ఉత్సవ మూర్తులను ఉంచుతారు. అనంతరం అర్చకుల మంత్రోచ్ఛారణలతో అష్ట దిక్పాలిక బలిహరణం చేసి, వసంతంతో కూడిన గుమ్మడిని ప్రదానం చేస్తారు. రథోత్సవం మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రారంభిస్తారు. సూర్యనారాయణ నామస్మరణతో గ్రామస్తులు రథాన్ని ముందుకు లాగుతారు. రథం ఆలయానికి రాత్రికి చేరుకోవడంతో రథోత్సవం ముగుస్తుంది . ఆలయ ప్రాంగణంలో దీపారాధనలు, అమృతకుండి ప్రసాద వినియోగాలు నిర్వహిస్తారు. ఆలయ ఉత్సవ కమిటీ, ఈఓ కొవ్వూరి గాయత్రి, వంశపారంపర్య ధర్మకర్త, చైర్మన్ కొవ్వూరి శ్రీనివాసబాల కృష్ణారెడ్డి భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు.


ప్రత్యేక అలంకరణలో దేవేరులతో సూర్యభగవానుడు

కాలువలో పడి వ్యక్తి మృతి


రామకృష్ణారెడ్డి మృతదేహం

అనపర్తి: స్థానిక వీర్రాజు మామిడి నుంచి అనపర్తి పాతవూరుకు చేరే మార్గంలో ప్రమాదవశాత్తూ బోదె కాలువలో పడి వ్యక్తి మృతిచెందాడు. శుక్రవారం ఉదయం స్థానిక వీర్రాజు మామిడి వద్ద బోదె కాలువలో కూరుకుపోయి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడన్న సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడు మండలంలోని పొలమూరుకు చెందిన తేతలి రామకృష్ణారెడ్డి(50)గా గుర్తించారు. అతను కొంతకాలంగా అనపర్తిలో పండ్ల దుకాణం వద్ద పని చేస్తూ ఒంటరిగా జీవనం సాగిస్తున్నాడు. కొబ్బరికాయల మూటను ద్విచక్ర వాహనంపై ఉంచుకొని ప్రయాణిస్తుండగా హ్యాండిల్ తిరగక పోవడంతో ప్రమాదవశాత్తు బోదె కాలువ పడి మృతిచెందాడని ఎస్‌ఐ పి.అప్పారావు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆయుర్వేదం భారత్‌లో ఉద్భవించింది


డాక్టర్ శ్రీనివాస్‌కె.రావును సత్కరిస్తున్న రెక్టార్ రమణ, డాక్టర్ రమేష్ తదితరులు

బాలాజీచెరువు: ఆయుర్వేదం ప్రాచీన భారతదేశంలో ఉద్భవించిందని డాక్టర్ శ్రీనివాస్ కె.రావు(న్యూయార్క్)పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో శుక్రవారం స్కూల్ ఆఫ్ ఫుడ్‌టెక్నాలజీ ఆధ్వర్యంలో మెటబోలోమిక్స్–ఏ న్యూ హారిజన్ ఫర్ బెటర్ ఫర్ హెల్త్ అంశంపై అతిథి ఉపన్యాసం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ 100 మిలియన్ల మెటాబోలైట్స్ ద్వారా మానవుని ఆరోగ్యంలో అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. ఇది ఆరోగ్యం, శ్రేయస్సు, మనసు, శరీరం, ఆత్మ మధ్య సున్నితమైన సమతుల్యతపై ఆధారపడి ఉంటుందన్నారు. ఆహారం, జీవనశైలి మార్పులు, మూలికా నివారణ ద్వారా శరీరంలో సమతుల్యతను కాపాడుకోవచ్చన్నారు. జేఎన్‌టీయూకే తొలి ఉపకులపతి డాక్టర్ అల్లం అప్పారావు మాట్లాడుతూ సిద్ధాంతం, ప్రయోగాలు నూతన కంప్యూటింగ్ పద్ధతులతో పాటు పరిశోధనలు చాలా ముఖ్యమన్నారు. వ్యాధికి మెరుగైన చికిత్సలు, ఆరోగ్యకరమైన జీవితంపై మంచి అవగాహన కల్పించడం ద్వారా విద్యార్థులను చైతన్యపరిచారు. రెక్టార్ కేవీ రమణ మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అరటిపండు తొక్కను కాస్మోటిక్స్‌లో వాడేందుకు వాణిజ్య విలువలతో పండిస్తున్నారని, వెలికితీతకు సాంకేతిక లోపం ఉండటం వలన విద్యార్థులు దీనిపై పరిశోధనలు చేయాలన్నారు. ఐఎస్‌టీ డైరెక్టర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ మానవునికి కేవలం ఆరోగ్యమే గొప్ప సంపదన్నారు. ప్రోగ్రాం చైర్మన్, ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ మాలోతు రమేష్ మాట్లాడుతూ వర్సిటీ వీసీ ప్రసాదరాజు, అధికారుల ప్రోత్సాహంతో ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించి వర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం డాక్టర్ శ్రీనివాస్ కె.రావును సత్కరించారు. డైరెక్టర్ పద్మరాజు, ప్రొఫెసర్ దీక్షితులు, ఏఎస్ఎన్ చక్రవర్తి, స్పోర్ట్స్ కౌన్సెల్ కార్యదర్శి శ్యామ్‌కుమార్, మెడికల్ బోర్డు డైరెక్టర్ డాక్టర్ బాబ్జి, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ నరసింహం పాల్గొన్నారు.

బాల్య వివాహానికి నిశ్చితార్థం

అడ్డుకున్న అధికారులు

అమలాపురం టౌన్: పట్టణంలోని 27వ వార్డులో 14 ఏళ్ల బాలికకు 30 ఏళ్లు ఉన్న తాళ్లరేవుకు చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగికి పెళ్లి చేసేందుకు నిశ్చితార్థం గురువారం జరుగుతోంది. ఈ సమాచారం అందుకున్న అధికారులు వెళ్లి అడ్డుకున్నారు. ఆ బాలిక కుటుంబీకులకు అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఐసీడీఎస్ అధికారులు, గ్రామ వార్డు సచివాల మహిళా సంరక్షణ కార్యదర్శి గీత ఆ బాలిక ఇంటికి వెళ్లి అంగీకార పత్రం రాయించుకోవడంతోపాటు కౌన్సెలింగ్ చేశారు. బాల్య వివాహాలు, నిశ్చితార్థ ప్రయత్నాలను సహించేది లేదని... వాటికి పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అమలాపురం ఐసీడీఎస్ అధికారిణి కె.విజయకుమారి హెచ్చరించారు. ఆ ప్రభుత్వ ఉద్యోగి కుటుంబీకులతో ఆమె ఫోన్‌లో మాట్లాడి బాలికను పెళ్లిచేసుకుంటే జైలుకు పంపిస్తామని చెప్పి మందలించారు.





సీఎం కప్ రాష్ట్ర పోటీలకు జిల్లా జట్ల ఎంపికలు

రేపటి నుంచి కాకినాడలో ఎనిమిది క్రీడలకు ఎంపిక ప్రక్రియ

అమలాపురం టౌన్: ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు వచ్చే ఫిబ్రవరి నెలలో నిర్వహించనున్న సీఎం కప్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల కోసం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయి జట్ల ఎంపికలు ఈ నెల 29వ తేదీ నుంచి మూడు రోజులపాటు కాకినాడలో జరుగుతాయని ఆ సంస్థ జిల్లా ముఖ్య శిక్షకులు పీఎస్ సురేష్‌కుమార్ తెలిపారు. మొత్తం ఎనిమిది రకాల క్రీడలపై ఈ ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. క్రీడాకారులు 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల వయస్సులోపు పురుషులు, మహిళలకు మాత్రమే ఈ ఎంపికలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి గల ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఆధార్ కార్డు, పుట్టిన తేదీ ధృవపత్రం నకళ్లు, ఒక పాస్ పోర్టు సైజ్ ఫొటోతో ఈ కింది పేర్కొన్న తేదీ, సమయం, ప్రదేశాలకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. బాల్ బ్యాడ్మింటన్‌కు కాకినాడ జిల్లా ప్రాధికార సంస్థ క్రీడా ప్రాంగణంలో ఈనెల 29వ తేదీ మధ్యాహ్నం 1 గంటకు హాజరయ్యేలా క్రీడాకారులు రావాలని సూచించారు. హ్యాండ్‌బాల్‌కు 29వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంటకు కాకినాడ ఇంద్రపాలెం ఐడీఎల్ కళాశాలకు రావాలి. టెన్నిస్, క్రికెట్‌కు 30వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంటకు, ఫుట్‌బాల్‌కు 31వ తేదీ ఉదయం 10 గంటలకు, హాకీ, కబడ్డీ, ఖోఖోకు ఈ నెల 31వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు కాకినాడ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ క్రీడా ప్రాంగణంలో జరిగే ఎంపికలకు క్రీడాకారులు హాజరు కావాలని సూచించారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీలకు అర్హులు అవుతారని సురేష్‌కుమార్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడ్డ గుర్తు తెలియనివ్యక్తి

అనపర్తి: స్థానిక ఏరియా ఆసుపత్రి సమీపంలోని ఓ ఫుట్‌పాత్ దుకాణం వద్ద గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలావున్నాయి. సుమారు 45 సంవత్సరాల వయసు గల వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు కొన్ని రోజులుగా మతిస్థిమితం లేకుండా ప్రవర్తిస్తూ, కొన్ని సందర్భాల్లో తనకు ఎదురుపడిన వారిపై దాడికి పాల్పడుతూ స్థానిక మెయిన్‌రోడ్డు, పరిసర ప్రాంతాల్లో తిరుగుతున్నాడు. ఘటనా స్థలం వద్ద సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా మృతుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు నిర్ధారించామని, మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రి మార్చురీలో ఉంచినట్లు చెప్పారు. మృతుడు ఒడిశా రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా భావిస్తున్నామని, వివరాలు తెలిసిన వారు అనపర్తి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.



కోడిపెట్ట దొంగతనంపై వివాదం

పి.గన్నవరం: ఊడిమూడి శివారు చింతావారిపేటలో కోడిపెట్టను దొంగిలించిన వివాదంలో పశ్చిమళ్ల శ్రీను అనే నిందితుడు ఐదుగురిపై దాడి చేసి గాయపరిచాడు. శ్రీను తొలుత కోడిపెట్ట యజమానిపై దాడి చేయడంతో అతడు పారిపోయాడు. దీంతో అతని భార్యను రోడ్డుపైకి లాక్కు వచ్చి లైంగిక దాడికి యత్నించాడు. అడ్డువచ్చిన మరో ముగ్గురు మహిళలపై ఇనుపరాడ్డుతో దాడి చేశాడు. పోలీసులు శుక్రవారం రాత్రి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఊడిమూడి శివారు చింతావారిపేటకు చెందిన నక్కా ధనరాజు కోడిపెట్టను ఈ నెల 21న అదే ప్రాంతానికి చెందిన పశ్చిమళ్ల శ్రీను, నక్కా ఆనందకుమార్ దొంగిలించి చికెన్ సెంటర్లో అమ్మేశారు. ఈ విషయం తెలుసుకున్న యజమాని ధనరాజు గురువారం తన బంధువైన బీర నర్సింహంను తీసుకుని నిందితులను ప్రశ్నించేందుకు వెళ్లాడు. అప్పటికే మద్యం సేవించి పశ్చిమళ్ల శ్రీను రాయితో ధనరాజుపై దాడి చేశాడు. ధనరాజుకు గాయం అవడంతో వారిద్దరూ అక్కడి నుంచి పారిపోయారు. అనంతరం శ్రీను ధనరాజు ఇంటికి వెళ్లి.. అతడి భార్య ధనలక్ష్మిని రోడ్డుమీదకు లాక్కువచ్చి ఇనుపరాడ్‌తో కొట్టి, లైంగికదాడికి యత్నించాడు. దీనిని అడ్డుకున్న అదే ప్రాంతానికి చెందిన కోట సాయమ్మ, లక్ష్మమ్మ, నర్సమ్మలపై కూడా శ్రీను ఇనుపరాడ్‌తో దాడి చేశాడు. గాయాలపాలైన ఐదుగురు అమలాపురం ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారు. ఎస్సై పి.గంగాభవాని కేసు నమోదు చేశారు. సీఐ డి.ప్రశాంతకుమార్ శుక్రవారం చింతావారిపేటలో విచారణ నిర్వహించారు. నిందితుడు శ్రీను కోసం పోలీసులు గాలిస్తున్నారు.

